క్లుప్తంగా

ఘనంగా అలఘునాథుని కల్యాణం

ఆత్మకూరు: పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవదేవేరుల కల్యాణాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు వేదమంత్రాలతో కల్యాణ ఘట్టాలను వివరిస్తూ శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో కోదండరామస్వామి ఆలయంలో గత రెండ్రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనాల్లో ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉట్టి వేడుక, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు జరిగాయి.

గంగాభవాని ఉత్సవాలు ప్రారంభం

గ్రామంలో వెలసిన అనంతపూరి గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు రాత్రి నిలుపుతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

అభినందన

సంగం: సంగంలో చేనేత కుటుంబానికి చెందిన బత్తూరు భానుశ్రీ సులోచన అనే విద్యార్థిని నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. ఆలిండియా స్థాయిలో 15,369వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఈ క్రమంలో విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు మోహనరావు, సులోచనను స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు, చేనేత కార్మికులు, స్థానికులు ఆదివారం అభినందించి, సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కలిగిరి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కలిగిరి–కృష్ణారెడ్డిపల్లి మార్గంలో పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొండాపురం మండలం ఇస్కదామెర్ల గ్రామానికి చెందిన ఇరగల ఇంద్రసేనారెడ్డి కలిగిరి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కానీ కలిగిరి–కృష్ణారెడ్డిపల్లి మార్గంలో పెట్రోల్ బంకు వద్ద తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు వింజమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి సిబ్బంది గాయపడిన వ్యక్తి కొండాపురం ఇస్కదామెర్లకు చెందిన ఇంద్రసేనారెడ్డిగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. బైక్ అదుపుతప్పి పడ్డారా.. లేదా గుర్తుతెలియని వాహనం ఢీకొందా అనే వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తిపై దాడి : బైక్ దగ్ధం

కొండాపురం: వ్యక్తిపై అకస్మాత్తుగా మరో వ్యక్తి దాడిచేసిన ఘటన మండలంలోని కొమ్మి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు మన్నం వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. కొమ్మి గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం వద్ద వెంకటసుబ్బయ్య, నజీర్, చెన్నుబోయిన మహేంద్ర, షేక్.చాంద్‌బాషా తదితరులు మాట్లాడుకుంటున్నారు. ఒక్కసారిగా గ్రామానికి చెందిన ఖాజామస్తాన్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి నజీర్‌ను తిట్టడంతో పక్కనే ఉన్న వెంకటసుబ్బయ్య పది మందిలో ఉన్నప్పుడు ఎందుకు తిట్టడం అంటూ వారించారు. దీంతో అతను కర్ర తీసుకుని వెంకటసుబ్బయ్య ఎడమ భుజం మీద దాడి చేశాడు. పక్కనే ఉన్న గ్రామస్తులు అతన్ని వారించి అక్కడి నుంచి పంపించారు. కాగా వివాదం జరిగిన కొంతసేపు తర్వాత అక్కడే ఉన్న ఖాజామస్తాన్ బైక్ తగలబడి దగ్ధమైంది. దీంతో అతను పోలీసులకు తన మీద దాడి చేసి బైక్‌ను దహనం చేశారని ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్ట్

కావలి (జలదంకి): కావలి రూరల్ మండలం చలంచర్ల అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 12 మంది జూదరులను పట్టుకున్నట్లు కావలి రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్సై తిరుమల రెడ్డిలు తెలిపారు. వారి వద్ద నుంచి తొమ్మిది కోళ్లను, రూ.12,090 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు తెలియజేశారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

సోమశిల: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన ఘటన అనంతసాగరం మండలం చిలకలమర్రిలో ఆదివారం వేకువన చోటు చేసుకుంది. బాధితులు వివరాల మేరకు.. చిలకలమర్రిలోని హైస్కూల్ సమీపంలో చిన్నపాటి గుడిసెలో పెంచలయ్య కుటుంబం నివాసం ఉంటోంది. కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఇంట్లో దీపారాధన చేశారు. అనంతరం భోజనాలు చేసి ఆరుబయట నిద్రకు ఉపక్రమించారు. అయితే ఏం జరిగిందో ఏమో వేకువజామున ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. పెంచలయ్య గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే ఈదురుగాలులు వీస్తుండడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సుమారు రూ.13 వేల నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. పెంచలయ్య కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రభుత్వం స్పందించి సాయం అందించాలని బాధితులు వేడుకున్నారు.

వ్యవసాయ సేవలకు స్వస్తి

మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వ్యవసాయం సంక్షోభంలో పడింది. రేషనలైజేషన్ పేరుతో గ్రామీణ స్థాయిలో ఉన్న రైతు భరోసా కేంద్రం (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం) వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. మెట్ట ప్రాంతాల్లో పనిచేస్తున్న వీఏఏలను ఈ–క్రాప్ పేరుతో కుదించి మైదాన ప్రాంతాలకు పంపుతున్నారు. దీంతో పాత తరహాలో మండల వ్యవసాయాధికారులే రైతులకు అన్నిరకాల సేవలు అందించాల్సి ఉంది. అయితే వారిని కూడా పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు రైతులకు రాయితీ విత్తనాలు సరఫరా కాలేదు. వ్యవసాయ పరికరాల ఊసే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడం లేదు.

- గ్రామాల్లో ఆర్బీకే వ్యవస్థకు మంగళం
- రేషనలైజేషన్ పేరుతో వీఏఏల కుదింపు
- భర్తీ కానీ వ్యవసాయాధికారుల పోస్టులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



మూత పడునున్న గణేశ్వరపురం ఆర్బీకే

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సమారు 50 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వర్షాలపై ఆధారపడి పంటల సాగు ఉంటుంది. సకాలంలో వర్షాలు కురిస్తేనే పంటలు సాగవుతాయి. కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో మాత్రం సోమశిల ఉత్తర కాలువ, కావలి కాలువ ద్వారా వచ్చే నీటి ఆధారంగా మాగాణి పంటలను సాగు చేస్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండలానికి ఒక వ్యవసాయ అధికారి మాత్రమే ఉండేవారు. దీంతో మండలంలో సాగువుతున్న అన్ని పంటలను ఆయన పర్యవేక్షించే పరిస్థితి ఉండేది కాదు. దీంతో రైతులకు సేవలు సకాలంలో అందక ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో రైతులకు మేలు చేసే ఆలోచనలో గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంస్కరణలు తీసుకొచ్చారు. రైతు సేవలు గ్రామస్థాయికి తీసుకొచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఆ వ్యవస్థకు మంగళం పాడింది. మరలా పాత విధానం అమల్లోకి తీసుకొచ్చింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో వ్యవసాయం పండగలా ఉండేది. అన్నిసేవలు రైతులకు క్షేత్రస్థాయిలో అందేందుకు ప్రపంచంలో ఎక్కడా అమల్లో లేని ఆర్బీకే(రైతు భరోసా కేంద్రం) వ్యవస్థను ప్రవేశపెట్టారు. వీటి ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు గిట్టుబాటు ధరలకు జరిగేవి. రైతులకు ప్రకృతి విపత్తుల్లో నష్టం వస్తే వారిని ఆదుకునే నిమిత్తం ఉచిత పంటల బీమాను అమలు చేశారు. అక్కడే రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందజేశారు. వీఏఏలు స్థానికంగా ఉంటూ వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు, నూతన పంటల సాగుపై అవగాహన కల్పించేవారు.

నేటి ప్రభుత్వంలో..

ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చారు. అంతే కాకుండా నియోజకవర్గంలో ఉన్న 92 ఆర్బీకేలను సగానికి తగ్గించారు. దీంతో ఆ వ్యవస్థ నిర్వీర్యమైంది. అందులో పనిచేసే గ్రామీణ వ్యవసాయ సహాయకుల(వీఏఏ) పోస్టులనూ కుదించారు. ఆర్బీకేల ద్వారా సరఫరా చేసే విత్తనాలు, ఎరువులను నిలుపుదల చేశారు. ఉచిత పంట బీమా ఆగిపోయింది. రాయితీతో అందించే వ్యవసాయ పరికరాలు కూటమి పార్టీ నేతలకు మాత్రమే అరకొరగా అందిస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

ఇలా తగ్గించారు

ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 64 మంది వీఏఏలు ఉంటే వారిని 38 మందికి కుదించారు. ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు, జలదంకి, కొండాపురం మండలాలల్లో ఇటీవల బదిలీల్లో వ్యవసాయాధికారులు ఎవరు రాకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. కేవలం సీతారామపురం, వింజమూరు, కలిగిరి మండలాల్లో మాత్రమే ఉన్నారు. దీంతో మెట్ట ప్రాంతంలో వ్యవసాయం సంక్షోభంలో పడింది.

మెట్టకు తీవ్ర అన్యాయం

ఉదయగిరి ప్రాంతంలో ఎక్కువగా మెట్ట పైర్లు అయిన మినుము, పెసర, పొగాకు, మిరప, మొక్కజొన్న, జొన్న, రాగి, ప్రొద్దుతిరుగుడు, శనగ, వేరుశనగ, సజ్జ పైర్లను సాగు చేస్తారు. వీటికి ఈ–క్రాప్ ఆధారంగా ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయి. కానీ సిబ్బంది లేకపోవడంతో ఈ–క్రాప్ సజావుగా సాగే పరిస్థితి ఉండదు. దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలు క్షేత్రస్థాయి రైతులకు అందే అవకాశం ఉండదు.

మెట్టలో సాగులో ఉన్న వేరుశనగ



ఆర్బీకే వ్యవస్థను కొనసాగించాలి



ఆర్బీకే వ్యవస్థ ప్రక్షాళనతో రైతులకు క్షేత్రస్థాయిలో అందే పలుసేవలు ఆగిపోయాయి. గత ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు ఆర్బీకే ద్వారా అందించేవారు. దీంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేయకపోవడంతో రవాణా ఖర్చులు మిగిలాయి. ఈ ఏడాది ఎరువులు ఇవ్వకపోవడంతో బయట నుంచి కొనుగోలు చేయడంతో ఖర్చులు భారంగా మారాయి. ప్రభుత్వం ఆర్బీకే వ్యవస్థను కొనసాగించాలి.

– విష్ణు, రైతు, గణేశ్వరపురం, వరికుంటపాడు మండలం

నిత్యావసర సరుకుల పంపిణీ



కావలి (జలదంకి): కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌లో డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. కావలి ఆర్డీఓ వంశీకృష్ణ పాల్గొని, వృద్ధులకు సరుకులను అందించి మాట్లాడారు. విద్యార్థులు పెద్దలతో ప్రేమగా, గౌరవంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేస్తూ వారిలో సామాజిక స్పృహ, సేవాభావం నింపుతున్న రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో విశ్వోదయ సేవా సమితి డైరెక్టర్ కూనం తాతారెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, నర్సింగ్ కాలేజీ అధ్యాపకురాలు శ్రీదివ్య, రమణయ్య, రంగనాయకులు పాల్గొన్నారు.

శేషారెడ్డికి నివాళి



కావలి (జలదంకి): అమరజీవి, రైతు సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసి పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన చింతం శేషారెడ్డి వర్ధంతిని కావలి మండలం గౌరవరం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1979 జూన్ 15న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బంద్ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగిన పోలీస్ కాల్పుల్లో శేషారెడ్డి అమరులైనట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి, నాయకులు గడ్డం మాల్యాద్రిరెడ్డి, కె.జాన్, ఉప్పాల యానాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వైద్య శిబిరం



పాల్గొన్న రోగులు



వైద్యుడు గజేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

- 176 మందికి కంటి ఆపరేషన్లు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వైఆర్‌జేసీ ప్రాంగణంలో పదిరోజుల నుంచి నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారంతో ముగిసింది. ఎన్నారై శేగు సతీష్ దాతృత్వంతో చెన్నై శంకర నేత్రాలయ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 900 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో అవసరమైన 176 మందికి స్థానికంగా ఏర్పాటు చేసిన మొబైల్ వ్యాన్ ఆపరేషన్ థియేటర్‌లో కంటి ఆపరేషన్లు చేశారు. మరో 164 మందికి మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై శంకర నేత్రాలయకు రెఫర్ చేశారు. నిర్వాహకుడు యల్లాల రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సమావేశంలో దాత సతీష్ తరపున ఆయన బంధువు కొండా వివేకానంద, వైద్యుడు గజేంద్రకుమార్‌వర్మ పాల్గొని, మాట్లాడారు. ఆయన ఇలాంటి సేవ కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. వచ్చే నెల 17న మర్రిపాడులో ఇదే తరహాలో వైద్యశిబిరం ఉంటుందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు గున్నం మధుసూదన్‌రెడ్డి, ఎస్వీ వర్సిటీ అధ్యాపకుడు యల్లాల వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, వైఆర్‌జేసీ ప్రిన్సిపల్ పద్మనాభరావు, శంకర నేత్రాలయ వైద్యులు రంజిత్ కుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్రవాడలో కోలాహలం



వడ్డిపాళెం వద్ద క్యూలైన్‌లో భక్తుల రద్దీ

- భక్తిశ్రద్ధలతో వెంగమాంబ నిలుపు

దుత్తలూరు : మండలంలోని నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దీంతో నర్రవాడ గ్రామంలో కోలాహలం నెలకొంది. తొలిరోజు అమ్మవారి నిలుపు సందర్భంగా వెంగమాంబ–గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు కలశాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, పూర్ణాహుతి చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలంకరణతో వెంగమాంబ ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు శోభాయమానంగా మారాయి. వెంగమాంబ, వినాయకుడు, దుర్గాదేవి, అష్టలక్ష్మి తదితర దేవతామూర్తుల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భక్తుల జేబులు గుల్ల

ఉత్సవాలకు వచ్చిన భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టాలంటే ధరలు చూసి విస్తుపోతున్నారు. విడిగా కొబ్బరికాయ విక్రయించకుండా అతి చిన్న సైజు పసుపు, కుంకుమ ప్యాకెట్, కడ్డీల ప్యాకెట్ తదితర సామగ్రిని ఒక కవరులో ఉంచి రూ.100 చొప్పున విక్రయిస్తూ భక్తుల జేబులు గుల్లచేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో భక్తులు మండిపడుతున్నారు. వెంటనే ధరలను నియంత్రించాలని కోరుతున్నారు.



నరసింహస్వామి విద్యుత్ కటౌట్



వెంగమాంబ విద్యుత్ కటౌట్



హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పిస్తున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు



అమ్మవారికి పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని టీడీపీ అభిమానులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి చర్యలను ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదన్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి బస్‌పాస్‌ల జారీ

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో విద్యార్థుల కోసం సోమవారం నుంచి బస్సు పాస్‌లను జారీ చేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న వారు తీసుకోవాలని కోరారు.

ప్రమాదాలకు నిలయంగా ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు

- పది రోజుల్లో రెండు దుర్ఘటనలు



నెల్లూరు–ముంబై రహదారిపై ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబై రహదారి నుంచి ఏఎస్‌పేటకు వెళ్లే క్రాస్ రోడ్డు ఆర్చ్ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. పది రోజుల క్రితం పొగాకు కూలీలను ఆటోలో తీసుకెళ్తున్న క్రమంలో వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందిన ఘటన మరువకముందే ఆదివారం సరిగ్గా అదే ప్రాంతంలో మరో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఏఎస్‌పేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రగాయాలపాలయ్యారు. గతంలో ఇదే ప్రాంతంలో మహిమలూరుకు చెందిన ఎం.హజరత్‌రెడ్డిని కారు వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. గతేడాది కూడా రెండు కార్లు ఎదురెదురుగా వస్తూ ఢీకొనే క్రమంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పి రెండు వాహనాలు రోడ్డుకు ఇరువైపులా గుంతల్లో బోల్తాపడి అందులోని వారు గాయాలతో బయటపడ్డారు. ఇలా పలు ప్రమాదాలకు నిలయంగా ఈ ప్రాంతం తయారవ్వడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బారికేడ్లను ఏర్పాటు చేయాలి

ఈ మార్గంలో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనివల్ల వాహన వేగం తగ్గి ప్రమాదాలను నివారించే అవకాశం ఉందంటున్నారు. అదేవిధంగా ఈ ముంబై రహదారిపై పెద్ద ఎత్తున స్పీడ్ బ్రేకర్లను కూడా ఏర్పాటు చేయాలని, అప్పుడే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు వీలు ఉందంటున్నారు. ఆ దిశగా రహదారులు, భవనాల శాఖ, మోటార్ వెహికల్ అధికారులు, మున్సిపల్ అధికారులు ఆలోచన చేయాలని కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నుంచి అనుమసముద్రంపేట వెళ్లే రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలు బాధాకరమని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆత్మకూరు పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద రోజుల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద అత్యంత ప్రమాదకర పరిస్థితి ఉందని, వాహనదారులు నిత్యం ప్రాణాలు అరచేత పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారన్నారు. పోలీసులు స్పందించి వేగ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఘటనా స్థలం వద్ద మాట్లాడుతున్న సీపీఎం నేత డేవిడ్‌రాజు